# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఈ రోజు ఉభయ సభల్లో ప్రవేశపెట్టారు.**

**2.** **జులై 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అతిసార నివారణ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పేర్కొంది.**

**3.** **ప్రభుత్వ కార్యాలయాల్లో వారానికి ఐదు రోజులు పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**4.** **రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది.**

**5.** **ప్రముఖ తెలుగు రచయిత ముళ్లపూడి వెంకటరమణ జయంతి ఈ రోజు.**

==========================

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై సభాపతి చర్చను ప్రారంభించగా, ప్రభుత్వం నీట్ పేపర్ లీక్ అంశంపై సభలో చర్చించాలని విపక్షాలు ఆందోళనకు దిగడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కన్పించింది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు ఆందోళల చేయడంతో రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. వాయిదా అనంతరం ఇరు సభలు తిరిగి ప్రారంభమైయ్యాయి.

------------------------

అతిసార వ్యాధి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వెంకటేశ్వర్ జిల్లా అధికారులను హెచ్చరించారు. అతిసార కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాల్లోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిన్న మంగళగిరిలోని ప్రధాన కార్యాలయం నుంచి ఆయన దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. నీటి నమూనాల నాణ్యత నిర్ధారణ పరీక్షలను సక్రమంగా చేయని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జులై 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే అతిసార నివారణ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

కల్పించాలని చెప్పారు. కాలానుగుణ, కీటక జనిత వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర సచివాలయంతో పాటు శాఖాధిపతుల కార్యాలయాల్లో వారానికి ఐదు రోజులు పనిదినాల విధానాన్ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీచేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

నీట్-యూజి పరీక్షలో అవకతవకలకు సంబంధించిన దర్యాప్తును కేంద్రప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర నేర పరిశోధక సంస్థ -సిబిఐ ఇద్దరు వ్యక్తులను బీహార్‌లోని పాట్నాలో అరెస్టు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. హజారీబాగ్ సెంటర్ నుండి ప్రశ్నపత్రాలను లీక్ చేసి, అనుమానాస్పద అభ్యర్థులకు అంతర్ రాష్ట్ర ముఠా వివిధ ప్రదేశాలలో పంపిణీ చేసినట్లు తేలిందని అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు చింటూ అలియాస్ బల్దేవ్, ముఖేష్ కుమార్‌లను సిబిఐ రిమాండ్లో తీసుకుని విచారించింది. బీహార్లో ఇప్పటివరకు ఈ కేసులో 17 మందిని అరెస్టు చేయగా, అందులో 15 మందిని ఆర్థిక నేరాల విభాగం అరెస్టు చేసింది.

---------------------------

రాష్ట్రంలో పలువురు ఉన్నతాధికారులకు శాఖలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కేఎస్ జవహర్‌రెడ్డిని ఆర్థికంగా వెనకబడిన వర్గాల సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పూనం మాలకొండయ్యను సాధారణ పరిపాలన శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కాగా ఇటీవల కేంద్ర సర్వీసు నుంచి రాష్ట్రానికి వచ్చిన పీయూష్ కుమార్‌ను ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా నియమిస్తూ ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం పేరుతో మూడు కొత్త నేర చట్టాలు జులై 1వ తేది నుండి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. ప్రతి ఒక్కరికీ సమర్థవంతమైన న్యాయ వ్యవస్థను అందుబాటులో తీసుకువచ్చే లక్ష్యంతో ఈ చట్టాలను కేంద్రప్రభుత్వం రూపొందించింది. నూతన నేర చట్టాల ముఖ్య నిబంధనలలో భాగంగా జరిగిన సంఘటనలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, పోలీసు స్టేషన్లో ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం, బాధితులు ఎఫ్ఐఆర్ ప్రతిని ఉచితంగా పొందడం వంటివి ఉన్నాయి. ఇవే కాకుండా, అరెస్టు అయిన వ్యక్తి తన పరిస్థితి గురించి వివరించడానికి హక్కు ఉంటుంది. కొత్త చట్టాల్లో - మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించిన పరిశోధనలకు కూడా ప్రాధాన్యమిచ్చారు. కేసుకు సంబంధించిన సమాచారాన్నంతా నమోదు చేసి, రెండు నెలల్లోగా పరిష్కరించాలని ఈ చట్టాలు పేర్కొంటున్నాయి.

---------------------------

వాయువ్య బంగాళా ఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని అదేవిధంగా కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి

నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు అప్రమ త్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం వచ్చేనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకురానున్న మూడు నూతన నేరన్యాయ చట్టాలపై విస్తృత అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన 'సంజ్ఞాన్' యాప్‌ను రైల్వే రక్షణ దళం డైరెక్టర్ జనరల్ మనోజ్ యాదవ్ నిన్న ఆవిష్కరించారు. కొత్త చట్టాలపై బలగాలకు సమగ్ర సమాచారాన్ని అందించడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని రైల్వేబోర్డు తెలిపింది. ఈ యాప్ పాత, కొత్త చట్టాల్లోని నిర్దిష్ట సెక్షన్లను సరిపోల్చుకుని, మార్పుల్ని అవగాహన చేసుకునేందుకు వీలుంటుందని పేర్కొంది.

---------------------------

గుంటూరు, అమరావతి ప్రాంతాలలోని రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని గుంటూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, పెండింగ్ నిధులపై నిన్న ఢిల్లీలో ఆయన రైల్వే మంత్రితో సమావేశమై చర్చించారు. రైల్వే ప్రాజెక్ట్ అంశాలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారని చంద్రశేఖర్ తెలిపారు.

---------------------------

పాత్రికేయునిగా, కథా రచయితగా, సినీ రచయితగా, నిర్మాతగా తెలుగు వారి హృదయాలలో చెరగని ముద్ర వేసిన ముళ్లపూడి వెంకటరమణ జయంతి ఈ రోజు. 1931వ సంవత్సరం జూన్ 28వ తేదీన తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలో జన్మించిన ముళ్లపూడి.. హాస్య రచనలకు పేరొందారు. ఆయన రాసిన పిల్లల పుస్తకం "బుడుగు" తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం సంపాదించింది. ప్రఖ్యాత చిత్రకారులు, దర్శకులు బాపుతో ముళ్లపూడి జీవితం పెనవేసుకు పోయింది. వీరిద్దరూ బాపు-రమణ జంటగా ప్రసిద్ధులయ్యారు. ముళ్లపూడి ఆత్మకథ కోతి కొమ్మచ్చి పేరుతో వెలువడింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు రమణను వరించాయి. తెలుగు వారి లోగిళ్ళలో జీవిత యథార్థ దృశ్యాలని హాస్యంలో రంగరించి ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ముళ్లపూడి వెంకటరమణ 2011 ఫిబ్రవరి 24వ తేదీన చెన్నైలో తుదిశ్వాస విడిచారు.

---------------------------

రెవెన్యూ శాఖ పరిధిలో ప్రజలకు జారీ చేసే ధృవీకరణ పత్రాలకు సంబంధించిన అన్ని ఆధారాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాతే జారీ చేయాలని పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భారత్ అధికారులను ఆదేశించారు. నిన్న శ్రీ సత్యసాయి జిల్లాలోని పరిగి మండలం శాసన కూటలో పర్యటించి ధ్రువీకరణ పత్రాల మంజూరుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పులతో ధృవీకరణ పత్రం జారీ అయితే దానికి అధికారుల బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు.

---------------------------

ఉభయగోదావరి జిల్లాలలోని గోదావరినదిపై నిర్వహించే పాపికొండల విహారయాత్రను ఈ రోజు నుంచి నాలుగు రోజుల పాటు నిలిపివేసినట్లు పర్యాటకశాఖ అధికారులు ప్రకటించారు. విస్తారంగా వర్షాలు కురవడంతోపాటు వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో యాత్రికుల భద్రత దృష్ట్యా నదీ పర్యాటక యాత్రని నిలుపుదల చేశామని అధికారులు తెలిపారు.

=====================